# లాభాలుగాడి మరణం

**లా**భాలుగాడు చచ్చేడు. మహాపాపిష్టి చావు చచ్చేడు. మంచివాళ్ళెవరూ అంతగా మరణవేదన పడరు. అసలే వాడికి శాశ్వతంగా బతకాలన్న అపేక్ష బలంగా ఉంది. దానికితోడు వైద్యులు ఎన్నో రకాల చికిత్సలు చేసి చూశారు. దీనివల్ల వాడి ఆయుర్దాయం పెరిగింది లేదుగానీ, నిష్కారణంగా వాడికీ మిగిలిన వాళ్ళకూ కూడా చెప్పరాని బాధలు మాత్రం కలిగాయి.

చాలా చిత్రమైన జాతకం ఈ లాభాలుగాడిది. వీడి తండ్రి స్వార్థం, వీడితల్లి పిశాచి. లోహ పరికరాల సహాయంతో వీడు తల్లి గర్భంనుంచి బయటపడ్డాడు. డబ్బు వాడికి పురుడు పోసింది. వీడి బారసాలకు మేధావులెవరూ రాలేదు. దైవజ్ఞులు వాడి జాతకాన్ని చేతముట్టలేదు. కొద్దిమంది మాత్రం వాడు అల్పాయువన్నారు. మరికొందరు వాడికి గండాలు జాస్తి అని జోస్యం చెప్పారు.

వాడి తరగతికి చెందిన ఇతరులతో పోలిస్తే వాడిది అల్పాయువు. లాభాలు గాడు మాత్రం తాను చిరంజీవిననీ, మృత్యుంజయుణ్ణనీ అనుకున్నాడు. ఎల్లకాలం బతికుండాలనీ, ప్రపంచాన్ని ఎదురులేకుండా ఏలాలనీ వాడికి గల ప్రబలమైన కాంక్షే ఈ విశ్వాసానికి ఆధారం.

మొదట్లో వీడివాసనవచ్చి వీడి చుట్టూ చేరినవారంతా సంస్కారహీనులు, కళాహీనులు, పిశాచ ప్రవృత్తులుగలవారు. ఈ క్షుద్రులను మంత్రివర్గంగా చేసుకుని లాభాలు తన పరిపాలన సాగించాడు. వాడిది నియంతృత్వ మనస్తత్వం. తనకు ప్రపంచాధిపత్యం లభించాక ఏమేం పనులు చెయ్యబోతాడో వాటికి విరుద్ధమైన పనులతో పరిపాలన ప్రారంభించి ప్రజలను లోబరచుకున్నాడు. వీడు అధికారంలోకి వస్తూనే రాజరికాన్ని దించేశాడు. మతాన్ని దూరంగా తరిమాడు. బానిసల సంకెళ్ళు పగలగొట్టేశాడు. శాస్త్రజ్ఞానాన్ని ప్రోత్సహించాడు. రాజకీయ హక్కులన్నీ ప్రజల పరం చేశాడు.

ఇదంతా చూసి ప్రజలు హర్షించేరు. మేధావులు కూడా వీణ్ణి బలపరిచారు. స్వేచ్ఛ పేరిట ప్రపంచాన్నే ఒక ఖైదుగా చేసేస్తాడనీ, కార్మికులందరికీ బానిసత్వం అంటగడతాడనీ, తానే రాజలాంఛనాలు ధరించి నిరంకుశత్వం అవలంబిస్తాడనీ, మతాన్ని సైతాన్ పరంచేసి

ప్రపంచం మూలమూలలకూ పంపకం చేస్తాడనీ, శాస్త్రజ్ఞానానికి సంకెళ్ళు తగిలించి తనకే ఊడిగం చేయించుకుంటాడనీ, ప్రజల హక్కులు తన స్వార్థాన్ని బలపరచనినాడు కాచుకొని భయంకరంగా అణచివేస్తాడనీ ఎవరన్నా కలగన్నారా?

లాభాలుగాణ్ణి ప్రజలు సరిగా అర్థం చేసుకుని వాడికి గల రెండు మొహాలు గుర్తించినట్టయితే వాడి శకం ఏనాడో ముగిసి వుండేది. కానీ వాడిలో ఎన్ని అవకతవకలున్నా యంటే వాణ్ణి అర్థం చేసుకోవటం ఒకంతట సాధ్యంకాదు. వాడు వృత్తి సౌకర్యాలతోబాటే నిరుద్యోగం కూడా పెంచాడు. సంపదతోబాటు దారిద్ర్యాన్ని పెంచాడు. వాడి పుణ్యాన ఎన్నడూ లేని కొత్త కరువులు వచ్చిపడ్డాయి - ధనధాన్యాదులు పుష్కలంగా ఉండగానే కాటకాలు! వాడి ఏలుబడిలో మానవ జీవితం అర్థరహితమైనంతగా అంతకు పూర్వం ఎన్నడూ కాలేదు. వాడి దుష్ప్రభావానికి లోనై తమకు ఫర్లాంగు దూరంలో ఉన్న వస్తువుల కోసం ప్రజలు వేలకొద్దీ మైళ్ళు ప్రయాణం చేశారు. సరుకులు మొయ్యటానికి భారతీయులు రంగూను వెళ్ళారు. కూలి పని చెయ్యటానికి ఆఫ్రికా వెళ్లారు. బతుకుతెరువుకోసం ఒక ఊరివారు కొందరు రెండో ఊరుకు రెండో ఊరివారు కొందరు మొదటి ఊరుకు వచ్చారు. లాభాలు గాడి పరిపాలనలో ప్రజల జీవితపు పునాదులు కూలిపోయాయి. వాటికొక నిలకడ గానీ, భవిష్యత్తుగానీ లేకుండా పోయింది.

చరిత్రకారులు లాభాలుగాణ్ణి మహామేధావి కింద చిత్రిస్తారు. ఇది మటుకు నిజం కాదు. వాడు ఎన్నోసార్లు ప్రాణం మీదికి తెచ్చుకున్నాడు. తెగతిని చిక్కి శల్యమౌతూ వచ్చాడు. వాడి ప్రాణం మీదికి వచ్చినప్పుడల్లా వైద్యులు భయంకరమైన చికిత్సలు చేసి వాణ్ణి బతికిస్తూ వచ్చారు. ఎన్నో దేశాల సంస్కృతిని, ఎంతోమంది ప్రజల సుఖాన్నీ, గౌరవాన్నీ, స్వాతంత్ర్యాన్నీ, రంగరించి వాడి గొంతులో పోస్తే వాడు గండాలు గడిచి బయటపడుతూ వచ్చాడు. ఎంతోమంది వాడి భక్తులు ఆత్మబలి అయి ఇతరులను బలిచేస్తే కానీ వాడు కోలుకోలేదు.

వీడికి మొట్ట మొదటిసారిగా చక్రం వేసి జాతకం గుణించిన వాడు కార్ల్‌మార్క్స్ అనే గడ్డం ఆయన. ఆ జాతకాన్ని లెనిన్ అనే బట్టతల ఆయన కొద్దిగా సంస్కరించి అంతర్దశల దగ్గర్నుంచీ నిర్ణయించటమేగాక భూభాగంలో ఆరోవంతుమేర వాడి ఏలుబడి లేకుండా చేసేశాడు. స్టాలిన్ అనే మీసాలాయన లాభాలుగాడికి చేతబడి చేసినట్టు పెద్ద వదంతి. కానీ అది అజ్ఞానుల కల్పన. స్టాలిన్‌కు పూర్వమే లాభాలుగాడి ఆఖరు వ్యాధి ప్రారంభమయ్యింది. ఆ వ్యాధిని ఉపశమింపజేయడానికి వాడి కింకరులు 1914లో రెండు పక్షాలుగా చీలి నర మారణం పెద్ద ఎత్తున సాగించారు. ఈ యజ్ఞం ఐదేళ్లు సాగించారు. ఉభయ పక్షాలా లక్షల సంఖ్యలో లాభాలుగాడి మనుష్యులే చచ్చారు. పాపం పండదా?

వాడు ప్రజా జీవితాన్ని ఎంత అర్థరహితం చేశాడో వాడి బతుకూ అంత అర్థరహితంగా మారిపోయింది.

ఆ మారణ హోమం అనంతరం కొద్దికాలంపాటు లాభాలు గాడు కోలుకున్నట్టు నటించాడు. కానీ తిరిగి పదేళ్ళలోనే వ్యాధి తిరగబెట్టింది. ఈసారి వాడికి భూతవైద్యం దగ్గర నుంచీ జరిగింది. జర్మనీ, ఇటలీ, స్పెయిన్, జపాన్ దేశాలలో భూతాలను ఆవాహన చేశారు. ఈ భూతాలు వాడి ఏలుబడిని అసలుకే తుడిచి పెట్టేట్టు కనబడ్డాయి. రోగం కన్న చికిత్స ప్రమాదకరంగా పరిణమించింది. ప్రపంచ ప్రజలు నడుము కట్టి భూతాల మారణ హోమానికి ఉపక్రమించారు. 1939 నుంచి 1945 దాకా ఈ మారణం సాగింది. కానీ లాభాలు గాడి రుగ్మత నయంకాలేదు. తన చికిత్స కోసమే ఈ మారణ హోమం జరిగిందనుకున్న లాభాలు గాడు తన కాలం సమీపించిందని తెలుసుకున్నాడు. మళ్ళీ తన వైద్యులను నియోగించాడు.

బుద్ధిలేని ఆ వైద్యులు అమానుషమైన చికిత్సలు ఆలోచిస్తున్నారు. మళ్ళీ భూతాలను అవాహన చేస్తున్నారు. లాభాలు గాణ్ణి బతికించటానికిగాను అణువులను పగల గొడుతున్నారు; రోగక్రిములను ఊరబెడుతున్నారు. ఇదంతా వృథా. ఇది వైద్యంకాదు. లాభాలుగాడికి కాలం తీరేపోయింది. ప్రపంచంలో దాదాపు సగం భాగం వాడి అధీనం నుంచి తప్పిపోయింది. మిగిలిన ప్రాంతంలో కూడా వాడి భృత్యుల సంఖ్య తగ్గిపోయింది.

అసలు లాభాలుగాడిది అరాచక లగ్నం. పైన రెండో మారణహోమం అనంతరం లాభాలుగాడికి సంధించింది. వాడి సంభాషణ ఎవరికీ అర్థం కావటల్లేదు. వాడి ఆజ్ఞలను ఎట్లా నిర్వర్తించాలో వాడి భృత్యులకే తెలియటంలేదు. వాళ్ళు “మా కర్తవ్యం యేమిటో తెలియటంలేదు ప్రభూ!” అని గోలపెట్టారు. ఇటీవల వాడు తన ఆంతరంగిక భృత్యులనే విరుచుకు తినసాగాడు. ఈ దేవుడు పూజార్ల నెత్తి అణచే పరిస్థితి కూడా ఏర్పడింది.....

ఇంతకూ ఈ లాభాలు గాడు ఎప్పుడు ఏ విధంగా చచ్చిందీ స్పష్టంగా తెలియటంలేదు. కొరియాలో చచ్చాడని కొందరు, స్వక్షేత్రమైన అమెరికాలోనే చచ్చాడని మరికొందరు అనుకున్నారు. వాడి వైద్యులే వాణ్ణి చంపారని కూడా ఒక పుకారున్నది.

కొందరు మట్టుకు లాభాలు గాడింకా చావలేదంటున్నారు. కొద్దిమంది మూఢులకు వాడు చిరంజీవి అన్న విశ్వాసం కూడా ఉంది. వాడి కుళ్ళిన శరీరంలోంచి వెలువడే విష వాయువులను చూసి వాడింకా బతికున్నాడని అపోహపడే వాళ్లు కూడా ఉన్నారు. వాడింకా కోలుకుని బతికివచ్చి తమకు ఒరగబెడతాడన్న విశ్వాసం గల భక్తాగ్రేసరులు కూడా లేకపోలేదు.

వాడి శవానికింకా చికిత్సలు చేస్తూనే ఉన్నారు వైద్యులు. ఈ వైద్యులకు ఏనాడో

మతిపోయింది. లాభాలు గాడి వంటిని జీర్ణించిన రోగాలన్నీ ఈ వైద్యులకు కూడా సంక్రమించాయి. వీళ్ళకి ప్రజలు ఉద్వాసన చెప్పి వీళ్ళ ఔషధాలను సముద్రంలో కలిపిననాడు ప్రపంచం మీద మళ్ళీ మలయ మారుతం వీస్తుంది. ఎండిన చెట్లు చిగురుస్తాయి. కరువు ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయి. ఎడార్లు పచ్చిక బయళ్ళవుతాయి. పిశాచాలు పలాయనం చిత్తగిస్తాయి. ప్రజల బుద్ధి వికసించి సౌరభం వెదజల్లుతుంది. ప్రపంచం భోగభాగ్యాలతో తులతూగుతుంది. మానవులకు అమరత్వం సిద్ధిస్తుంది.

***మొదటి ముద్రణ: ప్రజాశక్తి, 30 ఏప్రిల్ 1952***